కంప్లి చెక్‌పోస్టులో రూ. 8.23 లక్షలు స్వాధీనం

కంప్లి, మార్చి 29 : బళ్లారి జిల్లా కంప్లి చెక్‌పోస్టు వద్ద శుక్రవారం సా యంత్రం రూ. 8.23 లక్షలు నగదును పోలీసులు పట్టుకున్నారు. సాయంత్రం వేళల్లో సీఐ ప్రకాష్ మాలి, ఎస్ఐ బీఎస్ నాయుడు, సిబ్బంది గంగావతి నుంచి కంప్లి వైపు వస్తున్న ద్విచక్రవాహనాలను తనిఖీ చేయగా ఎమ్మిగనూరు జగదీష్, హనుమేష్, బసన్న గౌడ ఈ ముగ్గురి నుంచి రూ. 8.23 లక్షలు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదును స్వాధీనపరచుకున్నట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఉప్పరహళ్లి, కంప్లి కోట చెక్‌పోస్టు వద్ద రాత్రి పగలు అప్రమత్తంగా వుంటూ వాహనాల తనిఖీ చేపడుతున్నట్లు సీఐ ప్రకాష్ మాలి తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న ఇరుపార్టీల ముఖ్యనేతలు

బీజేపీ, జేడీఎస్ నేతల ఐక్యతా రాగం



కలిసి పనిచేద్దాం

● 28 మందిని గెలిపించుకుందాం ● అభివృద్ధి కోసమే పొత్తు : కుమార ● తొలిసారి దేవెగౌడ, యడియూరప్ప ఆధ్వర్యంలో సమావేశం

బెంగళూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కలిసి పని చేద్దాం... 28 మంది అభ్యర్థులను గెలిపించుకుందామని జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ప్రధాని దేవెగౌడ, బీజేపీ కీలక నేత యడియూరప్ప సంయుక్తంగా ప్రకటించారు. బీజేపీ-జేడీఎస్ పొత్తు కుదిరాక తొలిసారి అగ్రనేతల కీలకసమావేశం శుక్రవారం నగరంలో నిర్వహించారు. మాజీ సీఎం కుమారస్వామి, బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ రాధామోహన్‌దాస్ అగర్వాల్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, ప్రతిపక్షనేత అశోక్, మాజీ మంత్రి గోవిందకారజోళ, జేడీఎస్ నేత జీటీ దేవెగౌడలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని దేవెగౌడ మాట్లాడుతూ రాజకీయాల్లో రెండు పార్టీల మధ్య ఏమైనా సమస్యలు ఉంటే అన్నింటినీ వీడుదామని, కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. 28 నియోజకవర్గాల్లోనూ విజయం సాధిద్దామని అన్నారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి శక్తివంతుడు కావాలంట, కానీ దేశ ప్రధాని బలహీనంగా ఉండాలట... ఇటువంటి వ్యాఖ్యలు సీఎం సిద్దరామయ్య చేయడం సరికాదన్నారు. ప్రధానికి వ్యతిరేకంగా సిద్దరామయ్య ప్రభుత్వం కోర్టుకు వెళ్లిందన్నారు. రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తే, అప్పటి ప్రధాని మన్మోమహన్‌సింగ్ అసాధ్యమని ప్రకటించారన్నారు. ఇవన్నీ తెలిసిన సిద్దరామయ్య కోర్టుకు వెళ్తారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో మనకు వాతావరణం అనుకూలంగా ఉందని, కష్టపడితే ఫలితం ఉంటుందన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో నగదు ప్రవాహం జరగవచ్చునని అనుమానం వ్యక్తం చేశారు. ఇరు పార్టీల ముఖ్యులు సమన్వయంగా ముందుకెళ్లాలని, భిన్నాభిప్రాయాలకు తావివ్వరాదన్నారు. యడియూరప్ప మాట్లాడుతూ పొత్తు విషయంలో ఎటువంటి విభేదాలు లేవని, సమన్వయమే లక్ష్యంగా ముందుకెళ్దామన్నారు. పదేళ్ల నరేంద్రమోదీ పాలనలో దేశం ఎన్నో విధాలా అభివృద్ధి చెందిందన్నారు. ప్రపంచ దేశాలకు భారత్‌శక్తి ఏంటో రుజువైందన్నారు. మరోసారి నరేంద్రమోదీని ప్రధాని చేసేందుకు శాయశక్తులా కృషి చేద్దామన్నారు. ప్రజలు విశ్వాసంతో ఉన్నారన్నారు. జేడీఎస్ నేత కుమారస్వామి మాట్లాడుతూ అధికారం కోసం పొత్తుకు వెళ్లలేదని, అభివృద్ధి కోసమే అడుగులు వేశామన్నారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని, ఇప్పటికే సభ జరగాల్సి ఉండేదని, ఆరోగ్య రీత్యా కొంతకాజప్యం జరిగిందన్నారు. కార్యకర్తల్లో గందరగోళం లేకుండా సమన్వయం చేద్దామన్నారు. బీజేపీతో కలసి పనిచేయడం తనకు కొత్త కాదన్నారు. గతంలో 20నెలలపాటు ముఖ్యమంత్రిగా వ్యవహరించానన్నారు. పొత్తు ఏర్పడ్డంతో కాంగ్రెస్‌లో వణుకు పుట్టిందన్నారు. మూడునాలుగు సీట్లు కూడా గెలవలేమని కాంగ్రెస్‌వారే చెప్పుకుంటున్నారని అన్నారు. పొత్తు తాత్కాలికం కాదన్నారు. సమస్య ఎక్కడైనా తలెత్తితే ఇన్‌చార్జ్‌ల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. బీసీ నేత ప్రధాని నరేంద్రమోదీపై అహింద నేతగా చెప్పుకొనే సీఎం సిద్దరామయ్య విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర మాట్లాడుతూ దేవెగౌడ ఆశీస్సులు ఏనుగంత బలం ఇచ్చాయని పేర్కొన్నారు. రెండు పార్టీల మధ్య కుదిరిన ఒప్పందం చారిత్రాత్మకమన్నారు. ప్రతిపక్షనేత అశోక్ మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా రాష్ట్రమంతటా పర్యటిద్దామని తెలిపారు. సమావేశంలో జేడీఎస్ యువ నేత నిఖిల్ కుమారస్వామి, బీజేపీ అభ్యర్థులు శోభాకరంద్లాజె, బసవరాజ్ బొమ్మై, మాజీ సీఎం సదానందగౌడ తదితరులు పాల్గొన్నారు.



మండుతున్న ఎండలు

బెంగళూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. రాయచూరు జిల్లా హడగనహళ్లి ప్రాంతంలో రెండు రోజులుగా అత్యధికంగా 42.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. హొస్పేటలో 42.3, బీదర్ 41.8, తుమకూరు 41.5, బెళగావి 41.3, కొప్పళ 39.2 డిగ్రీలు, బెంగళూరులో గరిష్ఠంగా 36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మరో రెండు మూడు వారాల పాటు ఇదే తరహాలోనే ఎండలు కొనసాగే అవకాశం ఉన్నట్టు వాతావరణ పరిశోధనశాఖ ప్రకటించింది. బెంగళూరులో గరిష్ఠంగా ఐదు రోజులపాటు 36 డిగ్రీలు కొనసాగుతుందని ప్రకటించారు. ఎండలు పెరుగుతున్న కారణంగా అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎక్కువ నీరు తాగాలని, మజ్జిగ, కొబ్బరి నీరు, పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు. నీటిశాతం ఎక్కువగా ఉండే కూరగాయలు, పండ్లను



అత్యధికంగా తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన నీరు సమకూరుతుందన్నారు. బయట తిరిగేవేళ తలపై టోపీ, టవల్, గొడుగు వంటివి వాడాలన్నారు. 11 గంటల తర్వాత బయటకు వెళ్లే సందర్భంలో కనీస జాగ్రత్తలు పాటించాలన్నారు.



రక్షా రామయ్యకే చిక్కబళ్లాపుర టికెట్

● కాంగ్రెస్ మరో జాబితా విడుదల

బెంగళూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ స్థానాలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ మరో జాబితాను శుక్రవారం రాత్రి విడుదల చేసింది. చిక్కబళ్లాపుర నుంచి యువజన కాంగ్రెస్ పార్టీలో కీలకంగా ఉన్న రక్షా రామయ్యకు టిక్కెట్ ఖరారైంది. బళ్లారి నుంచి తుకారాం, చామ రాజనగర నుంచి సునిల్‌బోస్‌కు టిక్కెట్లు దక్కాయి. చిక్కబళ్లాపుర టిక్కెట్ కోసం కాంగ్రెస్ సీనియర్ నేత వీరప్పమొయిలీ, మాజీ ఎమ్మెల్యే శివ శంకర్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నించారు. అయితే అధిష్ఠానం రక్షారామయ్యకు కేటాయించింది. యూత్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. గతంలో రాష్ట్ర యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన తండ్రి ఎంఆర్ సీతారాం మాజీ మంత్రిగా వ్యవహరించి ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. చామరాజనగర రిజర్వు నియోజకవర్గం నుంచి మంత్రి మహదేవప్ప కుమారుడు సునీల్‌బోస్‌కు టిక్కెట్ వరించింది. అయితే కోలారు టికెట్ ఇంకా పెండింగ్‌లోనే ఉంచారు.



సునీల్‌బోస్



సుమలతకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విజయేంద్ర

సుమలతతో విజయేంద్ర చర్చలు

బెంగళూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండ్య ఎంపీ సుమలతను రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర భేటీ అయ్యారు. శుక్రవారం జేపీనగర్‌లోని సుమలత నివాసానికి వెళ్లిన విజయేంద్ర తాజా రాజకీయ పరిస్థితులపై చర్చలు జరిపారు. మండ్య నుంచి మరోసారి పోటీ చేయాలని ప్రయత్నించిన సుమలతకు టిక్కెట్ ఇవ్వలేదు. పొత్తులో భాగంగా మండ్య స్థానం జేడీఎస్‌కు దక్కింది. దీంతో సుమలత పోటీ చేసే పరిస్థితి లేకుండా పోయింది. మరో చోట టిక్కెట్ ఇస్తామని హామీ ఇచ్చినా ఆమె సిద్ధంగా లేనని సున్నితంగా తిరస్కరించినట్లు సమాచారం. ఇలా సాగుతుండగానే భవిష్యత్తులోను కలిసి పనిచేసే విషయమై చర్చలు జరిపినట్లు తెలిసింది.

డీకే సురేశ్‌కు డిపాజిట్ దక్కకుండా చేస్తాం

● బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ రాధామోహన్‌దాస్ అగర్వాల్

బెంగళూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు గ్రామీణ కాంగ్రెస్ అభ్యర్థి డీకే సురేశ్‌కు డిపాజిట్ రాకుండా చేస్తామని బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ రాధామోహన్‌దాస్ అగర్వాల్ పేర్కొన్నారు. బెంగళూరులో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఎన్నికల్లోనూ ప్రజలు అభ్యర్థిని పరిశీలిస్తారని తెలిపారు. బెంగళూరు గ్రామీణ పరిధిలోనూ అదే జరుగుతుందన్నారు. ఇక్కడ బీజేపీ గెలుపును ఎవరూ అడ్డుకోలేరన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి డీకే సురేశ్‌తోపాటు ఆయన అన్న డీకే శివకుమార్ వద్ద భారీగా డబ్బు ఉండవచ్చునని, తమ అభ్యర్థి డాక్టర్ మంజునాథ్ ప్రజల హృదయాలతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల తర్వాత గ్యారెంటీ పథకాలు నిలిచిపోతాయని అన్నారు. కేంద్రం నుంచి గ్రాంట్లు ఇవ్వలేదని రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడం రాజనీతిలో చెడు ధోరణి అన్నారు. ఎన్నికల ఫలితాలు ఏ విధంగా ఉంటాయో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు అర్థమైందన్నారు. అందుకే ఆయన పోటీకి వెనుకడుగు వేశారన్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య రాష్ట్రంలో పలువురు మంత్రుల పిల్లలను బలి పశువులను చేశారని, తన కుమారుడిని



మాత్రం పోటీకి దూరంగా ఉంచారని తెలిపారు. సొంత కుమారుడిని గెలిపించుకోలేని ఆయన అంతమంది మంత్రుల వారసులకు టిక్కెట్లు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. సీఎంగా కొనసాగే నైతికత సిద్దరామయ్య కోల్పోయారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి హిందూ వ్యతిరేక ధోరణి చూపుతున్నారని ఆరోపించారు. రాజ్యసభ సభ్యుడి అనుచరులు విధానసౌధలో పాకిస్థాన్ జిందాబాద్ అంటే ఆ సభ్యుడికి కాంగ్రెస్ నోటీసు ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో మరో నాలుగేళ్ల కాంగ్రెస్ అధికారంలో ఉండటం బీజేపీ భవిష్యత్తుకు మంచిదని, ఆ తర్వాతి ఎన్నికలలో వారికి కనీసం పది స్థానాలు కూడా దక్కవన్నారు.

పార్టీ కంటే ఎవరూ గొప్ప కాదు

బీజేపీలో ఎవరూ పార్టీ కంటే గొప్పకాదని రాధామోహన్‌దాస్ అగర్వాల్ అన్నారు. తమ పార్టీ నిరంతరంగా మార్పునకు ప్రాధాన్యత ఇస్తోందని, ఆ దిశగానే ఎంతోమంది కార్యకర్తలకు టిక్కెట్లు దక్కాయన్నారు. సుమలత, ప్రతాప్‌సింహా, మునిస్వామి, నళిన్‌కుమార్ కటీలు, డీవీ సదానందగౌడ, అనంతకుమార్ హెగ్డేకు మార్పులో భాగంగానే టిక్కెట్లు దక్కలేదన్నారు. చిత్రదుర్గ టిక్కెట్ విషయంలో కేంద్రమంత్రి నారాయణస్వామి, అభ్యర్థి గోవిందకారజోళ కలిసి నిర్ణయం తీసుకున్నారని, ఎటువంటి వివాదం లేదన్నారు.

ఈశ్వరప్ప నామినేషన్ దాఖలు చేయరు

తమ పార్టీ సీనియర్‌నేత ఈశ్వరప్ప నామినేషన్ దాఖలు చేయబోరని రాధామోహన్‌దాస్ అగర్వాల్ తెలిపారు. టిక్కెట్ దక్కలేదనే ఆగ్రహంతో ఉన్నారని, అయినా బీజేపీలో ఆయన క్రమశిక్షణ కలిగిన కార్యకర్త అన్నారు. ఇండిపెండెంట్‌గా గెలిచినా బీజేపీలోకి వస్తానని చెప్పడంపై ఆయన నామినేషన్ వేయరని, ఒక వేళ అది జరిగినా ఉపసంహరణ చేసుకుంటారని అన్నారు. హుబ్బళి- ధారవాడ టిక్కెట్ విషయమై కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి పట్ల పలువురు స్వామీజీలు వ్యతిరేకిస్తున్న అంశాన్ని పరిశీలిస్తున్నామని, వారితో చర్చలు జరిపి భావనలు అర్థం చేసుకుంటామని తెలిపారు.

బెంగళూరులో ఎన్నికల ప్రచారానికి పవన్‌కల్యాణ్

బెంగళూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ప్రముఖ తెలుగు నటుడు, జనసేన పార్టీ వ్యవస్థాపకుడు పవన్‌కల్యాణ్ బెంగళూరులో ఎన్నికల ప్రచారానికి రానున్నారు. బెంగళూరు నగర వ్యాప్తంగా తెలుగు ప్రజలు దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ నివసిస్తున్నారు. దీంతో పవన్‌కల్యాణ్ ద్వారా ప్రచారాలు నిర్వహించాలని బీజేపీ నేతలు నిర్ణయించారు. చిక్‌పేట బీజేపీ ఎమ్మెల్యే ఉదయ్‌గరుడాచార్ నివాసంలో గురువారం జరిగిన ప్రత్యేక సమావేశంలో చర్చించారు. ప్రతిపక్ష నేత అశోక్, ఎంపీ తేజస్వీ సూర్య తదితరులు పాల్గొన్న సభలో బెంగళూరు దక్షిణ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రచారంపై ప్రణాళికలు సిద్ధం చేశారు. బెంగళూరు దక్షిణ పరిధిలో బొమ్మనహళ్లి, బీటీఎం లేఅవుట్, హెచ్ఎస్ఆర్ లేఅవుట్, జయనగర్, జేపీనగర్, బసవనగుడితో పాటు బెంగళూరు సెంట్రల్ పరిధిలోని మారతహళ్లి, బెంగళూరు ఉత్తర పరిధిలోని యలహంక ప్రాంతాల్లో పవన్‌కల్యాణ్ రోడ్‌షోలు నిర్వహించాలని నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్‌లో పవన్‌కల్యాణ్‌కు ఎన్నికల ప్రచారాలు ఉన్న నేపథ్యంలో వీలు చూసుకుని రోడ్‌షోలు నిర్వహించేలా షెడ్యూలు కోరదలచినట్లు తెలుస్తోంది.





తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ వేడుకల్లో బీటీఎఫ్ సభ్యులు, అభిమానులు

ఘనంగా టీడీపీ ఆవిర్భావ వేడుకలు

బెంగళూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ వేడుకలు బెంగళూరు తెలుగుదేశం ఫోరం కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బీటీఎఫ్ వ్యవస్థాపకుడు కనకమేడల వీరతో పాటు పలువురు పాల్గొన్నారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న శాసనసభ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని సొంతూళ్లకు వెళ్లి పనిచేద్దామని నిర్ణయించారు. ఇదే సందర్భంగా బీటీఎఫ్ ఆధ్వర్యంలో పదేళ్లుగా అమలు చేస్తున్న కార్యక్రమాలను చర్చించారు.



యలహంక వేడుకల్లో టీడీపీ అభిమానులు

యలహంకలో...

తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని యలహంకలో ఘనం గా నిర్వహించారు. చేనేత కార్మికులతోపాటు తెలుగుదేశం పార్టీ అభిమానులు పాల్గొన్నారు. దేవాంగం పాపన్న, చిన్నప్ప ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేశారు. ఎన్టీఆర్, చంద్రబాబుకు జేజేలు పలికారు. కాగా అనంతపురం లోక్‌సభ అభ్యర్థిగా అంబికా లక్ష్మీనారాయణ పేరు ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పురుషోత్తమ్, వెంకటశివ, రెడ్డెప్ప, అశోక్, బాలాజి, పృథ్వి తదితరులు పాల్గొన్నారు.



గజవాహనంపై దర్శనమిచ్చిన లక్ష్మీనరసింహుడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఖాద్రీ లక్ష్మీ నరసింహుడు శుక్రవారం గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యపూజ, హోమం అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. సంధ్యాసమయంలో శ్రీవారు గజ వాహనంపై ఊరేగారు. శ్రీమహావిష్ణు దశావతారాల్లో ఒక్కటైన నరసింహుడికి దేవేంద్రుడు తన వాహనమైన ఐరావతాన్ని పంపుతారని భక్తుల నమ్మకం. తెల్లవారితే బ్రహ్మరథోత్సవం ఉండటంతో ఆలయ ప్రాంగణంతో పాటు తిరువీధులు భక్తులతో కిక్కిరిసి పోయాయి.

- కదిరి




నేడు ఖాద్రీశుడి బ్రహ్మారథోత్సవం

కదిరి, మార్చి 29: శ్రీసత్యసాయి జిల్లా కదిరిలోని ఖాద్రీశుడి రథోత్సవానికి సర్వం సిద్ధమయ్యింది. దేశంలోనే ప్రాముఖ్యత కలిగిన ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి రథాన్ని సుందరంగా అలంకరించారు. అధికారులు, పోలీసు సిబ్బంది రథోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు చేశారు. రథం లాగడానికి మొద్దులు, మోకులు, తెడ్లు ఇప్పటికే సిద్ధం చేశారు. భక్తుల రాకకోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ అదనపు బలగాలను సిద్ధం చేసింది. ఇప్పటికే పలు వాహనాలతో కదిరి పట్టణం నిండిపోయింది. లక్ష్మీనరసింహస్వామి ఆలయం భక్తులతో కిటకిలాడుతోంది. ఉదయం 7.20గంటలనుంచి 8.10 నిమిషాల లోపు అనురాధ నక్షత్రలోని శుభ మేష లగ్నం పుష్కర్మాంశంలో రథాన్ని కదిలించాలని పండితులు ముహూర్తం ఖరారు చేశారు. అన్నిశాఖల సమన్వయంతో ఆలయ అధికారులు రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో అన్నదాన ఏర్పాట్లు విస్తృతంగా చేపట్టారు.

మొద్దులు, మోకులు సిద్ధం

లక్ష్మీనరసింహస్వామి రథం భక్తుల శక్తి మీదే ముందుకు కదులుతోంది. ఎటువంటి యంత్రాలు ఇం దులోఉపయోగించరు. రథం లాగడానికి మోకులు (తాళ్లు) రథం ముందుకు కదలడానికి వెనుకవైపున వేసే మొద్దులు, రథం సరైన దారిలో నడవడానికి తెడ్లు సిద్ధం చేశారు. ముందు భాగాన భక్తులు మోకులు లాగుతుంటే వెనకబాగాన మొద్దులు వేయడంలో ఆరితేరిన కుటాగుళ్ల, గజ్జలరెడ్డిపల్లి, మూర్తిపల్లి, గంగిరెడ్డిపల్లి గ్రామస్థులు కీలకపాత్ర పోషిస్తారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా భక్తుల గోవింద నామస్మరణ, అర్చకుల వేదమంత్రోచ్ఛారణలతో రథం ముందుకు కదులుతుంది.





తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,581.01	1,587.63
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	848	6,774
సామర్థ్యం (టీఎంసీలు)	4.98	9.17

తోలుబొమ్మలాట ప్రదర్శన



తోలుబొమ్మలాటలో పాల్గొన్న కళాకారులు

బళ్లారి సిటీ, మార్చి 29: ప్రపంచ రంగస్థల దినోత్స వాన్ని పురస్కరించుకుని శ్రీమారుతీ ట్రస్ట్ బళ్లారివారి ఆధ్వర్యంలో శుక్రవారం రామరావణ యుద్ధం పేరుతో తోలుబొమ్మలాట జరిగింది. శ్రీమారుతీ ట్రస్టు శుక్రవారం నగరంలోని సెంట్రల్ లైబ్రరీలో ఈ ప్రదర్శనను ఘనంగా నిర్వహించింది. ఈసందర్భంగా రమణప్ప, విరూపాక్ష దేవ లాపుర్, కొమరిగౌడ, సుంకన్న, బాబుజగజ్జీవన్‌రామ్, విక లాంగుల జిల్లా అధ్యక్షుడు ఆనంద ,సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లలో రూ.173 లక్షల కోట్ల అప్పు

ఇదే మోదీ ఘనత: సంతోష్‌లాడ్ ఎద్దేవా



మాట్లాడుతున్న కార్మికశాఖ మంత్రి సంతోష్ లాడ్

బళ్లారి సిటీ,మార్చి 29: కేవలం 10 సంవత్సరాల కాలంలో దేశంలోని సామాన్య ప్రజలపై రూ.173లక్షల కోట్ల రుణభారం మోపింది బీజేపీ ప్రభుత్వం కాదా? అని కార్మిక శాఖా మంత్రి సంతోష్‌లాడ్ ప్రశ్నించారు. సండూర్ పట్టణ ఎమ్మెల్యే కార్యాలయంలో ఎన్నికల సమావేశాన్ని ప్రారంభించి మాట్లాడుతూ, పెట్రోల్, డీజిల్,గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. 1,45,000 కోట్ల కార్పోరేట్ రుణాలు మాఫీ చేశారనీ, ఈ దేశంలో రైతులకు రుణ మాఫీ చేయలేదన్నారు. కృషిభాగ్య, గృహలక్ష్మి పథకాలతో సిద్దరామయ్య ప్రభుత్వం నేరుగా రైతులకు చేరే విధంగా సంక్షేమ పథకాలను అమలుచేసున్నదన్నారు. అందుకని కాంగ్రెస్ అభ్యర్థి తుకారాంకు ఓటు వేసి గెలిపించాల న్నారు. కార్యక్రమంలో హరపనహళ్లి అసెంబ్లీ నియోజక వర్గ ఎమ్మెల్యే లతా మల్లికార్జున, జిల్లాధ్యక్షుడు శివయోగి, మహిళా అధ్యక్షురాలు ఆశాలత సోమప్ప, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సతీశ్, ఏకాంబ్రప్ప, వాడా మాజీ అధ్యక్షుడు రోషన్, అంజుమన్, కమిటీ అధ్యక్షుడు హసన్ తదిత రులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన



ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సిరుగుప్ప, మార్చి 29: ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని తాలుకా సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ రాజేశ్వరి తెలిపారు. సిరుగుప్ప పట్టణంలో శుక్ర వారం హాస్టల్ విద్యార్థులు ఓటు హక్కు వినియోగించుకో వడంపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఓటు హక్కు వినియోగించుకోవడంపై విద్యార్థులు తల్లిదండ్రులకు లేఖలు రాసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సంద ర్భంగా హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వీపీఎల్ సీజన్-4 క్రికెట్ క్రీడాపోటీలు ప్రారంభం

బళ్లారిరూరల్, మార్చి 29: బళ్లారి తాలుకాలోని ఎర్ర గుడి గ్రామంలో వీపీఎల్ సీజన్-4 క్రీడా పోటీలను శుక్ర వారం ప్రారంభించారు. ఈ పోటీల్లో దాదాపుగా ఎనిమిది పల్లెలకు చెందిన పది టీమ్‌లు పాల్గొన్నాయి. ఈ క్రీడాపో టీలను 25 రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ తిమ్మప్ప నాయక్ తెలిపారు. ఈ పోటీల్లో మొదటి బహు మతిగా రూ. 25 వేలు, రెండవ బహుమతిగా రూ.15 వేలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. బీడీహళ్లి, అంజి, మహేష్, సూర్యప్రకాష్ రెడ్డి, లోకయ్య, మల్లయ్య, పరశు రామ్, లింగ, గోవిందు, వెంకటేష్, రమేష్, గోవిందు తది తరులు పాల్గొన్నారు.

ఓటు వేసేందుకైనా వస్తారా?


● బతుకుదెరువు కోసం జనం వలసలు ● ఓట్ల కోసం నాయకుల తిప్పలు

కరువు తాండవిస్తోంది. పూట గడవక కూలీలు వలస పోతున్నారు. వలస వెళ్లిన వారి కోసం నాయకులు ఆరా తీస్తున్నారు. అసలు వాళ్లు ఓటింగ్‌కు వస్తారా? లేదా? అని విచారిస్తున్నారే తప్ప.. వలస వెళ్లిన వారికి ఇక్కడ ఉపాధి కల్పించడంపై నాయకులు, అధికారులు శ్రద్ధ చూపకపోవడం విచారకరం.

బళ్లారి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిస్థితి దుర్భంగా ఉంది, పూట గడవక కూలీలు వలస పోతున్నారు. తుంగభద్ర జలాశయంలో రెండో పంటకు నీరు లేకుండా పోవడం, అలాగే ఇతర వర్షాధార పంటల సాగు కష్టంగా మారడం, బోర్లలో నీరు ఇంకి పోయి పండ్లతోటలు కూడా ఎండిపోతుండడం ఇలా అనేక కారణాలతో ఈ ప్రాంత జనం బతుకు తెరువు కోసం ముంబాయి, హైద్రాబాద్, బెంగళూరు లాంటి ప్రాంతాలకు వలస పోతున్నారు. మార్చి నెల నుండి వలస వెళ్లడం పెరిగింది. ఒక పక్క బతుకు తెరువుకు ప్రజలు ఇతర ప్రాంతాలకు పొట్ట చేత పట్టుకుని గ్రామాలకు నుంచి వెళ్లిపోతుంటే, మరో వైపు ఓట్ల కోసం గ్రామాలకు వెళు తున్న నాయకు లకు తాళాలు వేసిన ఇళ్లు దర్శనం ఇస్తున్నాయి. వీళ్ల కనీసం పోలింగ్ రోజైనా వస్తారా? అని పోటీలో నిలి చిన నాయకులు ఆరా తీస్తున్నారు. వీరు రాకుంటే పోలింగ్ శాతం తగ్గి తాము ఓటమి పాలవుతామని నాయకులు బెంగపడుతున్నారు.



ఇంటి వద్ద ఉన్న వృద్ధులు



జనం వలస వెళ్లడంతో నిర్మానుష్యంగా ఉన్న కూడ్లిగి గ్రామం

బళ్లారి జిల్లాలోని సిరుగుప్ప, విజయనగర జిల్లాలోని కూడ్లిగి, చిత్రదుర్గం, కలబురగి,రాయ చూరు, బీదర్, తదితర ప్రాంతాల నుంచి వలసలు ఎక్కువగా ఉన్నాయి. కూడ్లిగి తాలూకా నుండి కూలీలు చెరుకు నరికేందుకు వెళ్లగా, రాయచూరు జిల్లా కూలీలు తెలంగాణాకు ఇంటి నిర్మాణం పనులకు వెళుతున్నారు. మరికొందరు బెంగళూరు, ముంబాయి లాంటి ప్రాంతాల్లో పనులకు వెళుతున్నారని గ్రామస్తులు తెలిపారు.

ఇంతకు ముందు ఇక్కడకు వేరే ప్రాంతాల నుంచి జనం ఇక్కడికి వలస వచ్చేవారు. ఇక్కడ తుంగభద్ర జలాశయం కింద ఉండే ఆయకట్టుభూమిలో చెరుకు నరకడం, వరి నాట్లు వేయడం లాంటి పనులకు వచ్చేవారు. అలాంటిది ఈసారి తుంగభద్ర డ్యాంలో నీరు లేక చాలా మంది ఇక్కడ నుంచే ఇతర ప్రాంతాలకు వలసవెళ్లారు. పూట గడవక చాలా మంది వలస వెళుతుంటే నాయకులు ఓట్ల కోసం గ్రామాలకు వెళుతున్నారు. అప్పుడు వాస్తవం తెలుసుకుని వలస వెళ్లిన వారి కోసం ఆరా తీస్తున్నారు. పాలకులు వలస వెళ్లిన వారిని తిరిగి సొంత ఊరికి రప్పించాలని అలాగే వారికి ఉపాధి కల్పించాలని స్థానికులు కోరుతు న్నారు



ప్రచారంలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి శ్రీరాములు

మూడోసారి కూడా ప్రధాని మోదీనే

కంప్లి, మార్చి 29: లోక్‌సభ ఎన్నికల్లో దేశంలో అత్య ధిక స్థానాల్లో బీజేపీ గెలుపొంది, మూడవసారి కూడా ప్రధానిగా నరేంద్ర మోదీనే పరిపాలన సాగిస్తారని బళ్లారి బీజేపీ అభ్యర్థి శ్రీరాములు తెలిపారు. కంప్లి తాలుకా పరిధిలోని దేవలాపురం మెట్రి, చిక్కజాగనూరు, దేవసముద్రం, కంప్లి, రామసాగరం, ముద్దాపురం, తదితర గ్రామాలలో ఆయన శుక్రవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లా డుతూ మోదీ పాలన వల్ల దేశం అభివృద్ధి బాటలో సురక్షి తంగా ముందుకు సాగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం పేరుకు మాత్రమే పథకాలు అమలు చేస్తోందని, అయితే కొందరి ఖాతాల్లో డబ్బులు జమ కావడంలేద న్నారు. కంప్లి తాలుకాలో సోమప్ప చెరువు, కురుగోడు, కంప్లి తాలుకాలో మిని విధానసభ బీజేపీ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమయ్యాయన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు మాట్లాడారు. కార్యక్రమంలో అనిల్ లాడ్, రామలింగప్ప, హళ్లళ్లి వీరేష్, ఎర్రంగళి తిమ్మారెడ్డి, బ్రహ్మయ్య, పురుషోత్తమ్, సీఆర్ హనుమంతు, మహదేవ, కుమార్,పంపన్నగౌడ, మారెప్ప, రమేష్‌గౌడ, కడేమనె పంపాపతి పాల్గొన్నారు.

భద్ర డ్యాం నీరు వదిలితేనే..

తాగునీటి సమస్య పరిష్కారం: విజయనగర డీసీ జేఎస్ దివాకర్ వెల్లడి

బళ్లారి,మార్చి29(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయానికి పై ప్రాంతంలో ఉండే భద్ర డ్యాం నుంచి నీరు విడుదల అయితేనే తుంగభద్ర డ్యాం సమీప గ్రామాలకు నీటిసమస్య తీరుతుందని, లేకుంటే తాగునీటి అవసరాలు మరింతగా పెరుగుతాయని విజయనగర జిల్లా కలెక్టర్ జే.ఎస్ దివాకర్ పేర్కొన్నారు. విజయనగరలో శుక్రవారం తాగునీరు విడుదల చేయాలని కొందరు డిమాండ్ చేసిన సందర్భంగా డీసీ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తుంగభద్ర జలాశయం పూర్తిగా నీరు లేక ఎండిపోయిందని దీంతో విజయనగర జిల్లాకు కూడా నీటి సమస్య ఏర్పడిందన్నారు. భద్ర డ్యాం నుంచి రెండు మూడు టీఎంసీలు నీరు డ్యాంకు వస్తేనే అప్పుడు ఇక్కడ తాగునీరు అవసరం తీరుతుందని పేర్కొన్నారు. భద్ర రిజర్వాయర్‌లో ఉండే నీటి పరిస్థితిని బట్టి అక్కడ నుంచి నీరు విడుల చేయించుకునేందుకు తాము ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉగాదిలోపు వానలు వస్తే ఎంతో కొంత నీటి సమస్య తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు.



డి.సీ జే.ఎస్ దివాకర్

సిరుగుప్పలో ఇకపై వారానికోసారే తాగునీటి సరఫరా

సిరుగుప్ప, మార్చి 29 : ఇకపై సిరుగుప్ప పట్టణానికి ఎనిమిదిరోజులకొకసారి తాగునీటిని విడుదల చేయనున్నట్లు నగరసభ కమీషనర్ గురుప్రసాద్ తెలిపారు. సిరుగుప్ప తాలుకాలోని తుంగభద్ర నది నుంచి సిరుగుప్ప చెరువుకు నీటి సరఫరా తక్కువగా వుండటంతో ఏప్రిల్ నుంచి ఈ విధంగా చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

12న నామినేషన్: తుకారాం



కనకదుర్గమ్మ పూజల్లో కాంగ్రెస్ అభ్యర్థి తుకారాం

బళ్లారి సిటీ,మార్చి 29: బళ్లారి లోక్ సభ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ తరఫున ఏప్రిల్ 12న నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఇ.తుకారాం తెలిపారు. తన ఆరాధ్యదైవమైన దుర్గమ్మకు పూజలు చేసి నగరంలోని పార్టీ అధినేత నివా సానికి వెళ్లే ముందు తనను కలిసిన మీడియాతో ఆయన మాట్లాడారు. తన కుమార్తెకు టికెట్ అడిగానని, కాని పార్టీ నిర్వహించిన సర్వేలో తన గెలుపు ఖాయమని తేలడంతో తనకే టికెట్ ఇచ్చారన్నారు. సామాన్య పౌరుడినైన తనకు టికెట్ ఇచ్చి ఎమ్మెల్యేని, మంత్రిని చేశారని, మున్ముందు మరిన్ని అవకాశాలు రావ చ్చునన్నారు. జిల్లా ఇన్‌ఛార్జిమంత్రి నాగేంద్ర, జమీర్ అహమ్మద్, కార్మికశాఖ మంత్రి సంతోష్‌లాడ్, పెద్దలు కేసీ కొండయ్య, అల్లం వీరభద్రప్ప, ఎమ్మెల్యేలు గవి యప్ప, గణేశ్, భరత్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు పిటీ. పరమేశ్వర్‌నా యక్, భీమానాయక్, ఎఎస్‌ఎల్ స్వామి, జిల్లా అధ్యక్షులు, కార్యకర్తల సహకారంతో గెలుపుకు కృషి చేస్తామన్నారు. గతంలో ఈ నియోజకవర్గం నుంచి ఎంపీలుగా సోనియాగాంధీ, బసవరాజేశ్వరి, కోళూరు బసవనగౌడ, కేసీ. కొండయ్యలు తది తర హేమాహేమీలు గెలిచారన్నారు. గత పదేళ్లలో బీజేపీ ఇక్కడ ఎలాంటి అభి వృద్ధి చేయలేదన్నారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు

బళ్లారిరూరల్, మార్చి 29 : బళ్లారి నగరంలోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం బళ్లారి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి ఈ తుకారామ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. తుకారామ్‌తో పాటు భార్య పూర్ణిమ, తుకారామ్ కూతురు స్వప్నికలు పాల్గొన్నారు. పూజల్లో ఆయనతోపాటు బుడా అధ్యక్షుడు, కార్పొరేటర్లు ముల్లంగి నందీష్, కుబేర, ప్రభంజన్ కుమార్, రాజేశ్వరి సుబ్బరాయుడు, పూజారి గాదెప్ప, బీఆర్ఎల్ శీన, కాంగ్రెస్ ప్రముఖులు రాంప్రసాద్, కలకంబం పంపాపతి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో మీడియా పాత్ర ముఖ్యం: డీసీ మిశ్రా

బళ్లారి సిటీ, మార్చి 29: ప్రజాస్వామ్య వ్యవస్థలో జరిగే ఎన్నికల్లో మీడియా భాగస్వామ్యం చాలా ముఖ్యమని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లాకలె క్టర్ ప్రశాంత్ కుమార్‌మిశ్రా తెలిపారు. జిల్లాపంచాయితీ హాల్లో శుక్రవారం జిల్లాస్వీప్ కమిటీ వార్తా పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్ర మంలో ఆయన మాట్లాడారు. మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎమ్‌ఎంసీ) పెయిడ్ న్యూస్ గురించి మీడియా ప్రతినిధులకు వివ రించారు. లోక్‌సభ ఎన్నికలు మే 7న జిల్లాలో జరుగనున్న నేపథ్యంలో మీడియా అబ్జెక్టివ్ వార్తలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. టీవీ, కేబుల్, వార్తాప త్రికల్లో ప్రచురితమయ్యే రాజకీయ ప్రకటనలకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరని స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల్లో రాజకీయ పార్టీలు, వ్యక్తుల ప్రకటనలను కూడా ఎంసీఎంసీ కమిటీ పర్యవేక్షిస్తుందని, వీటికి కూడా అనుమతి తీసుకోవాల న్నారు. జిల్లాస్వీప్ నోడల్ అధికారి శరణప్ప మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో మీడియాను నాల్గవ స్తంభంగా పరిగణిస్తున్నామన్నారు. ఎన్నికలను నిర్వహిం చడంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి కూడా కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. జిల్లాలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు జిల్లాస్వీప్ కమిటీ ద్వారా పలు కార్యక్రమలు నిర్వహిస్తున్నామని, ఇందుకు సంబంధించి స్వీప్ కార్యాచ రణ కార్యక్రమాలకు మరింత ప్రచారం కల్పించాలని కోరారు. ప్రింట్ మీడి యాలో రాజ కీయ ప్రకటన ఏదైనా వస్తే దానికి అనుమతి ఉందా అనే కోణంలో విచారణ జరుపుతామని డిప్యూటీ కలెక్టర్ మహ్మద్‌జుబేరా తెలిపారు. లేదంటే ఆ మీడియాపై ఐపీసీ సెక్షన్ 171హెచ్ ఉల్లంఘన కింద కేసు నమో దుచేస్తామన్నారు. కార్యక్రమంలో వార్తా పౌరసంబంధాల శాఖ సిబ్బంది, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

సంతలో పెరిగిన పశువుల విక్రయాలు

● కరువు విలయతాండవం

● పశుగ్రాసం కొరతతో జీవాలకు నరకం

బళ్లారి సిటీ, మార్చి 29: కరువు కారణంగా కల్యాణ కర్ణాటకలోని రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను ఆలకించే నాయకులే లేకపోవడంపై బాధితుల్లో విషాదం వ్యక్తమౌతోంది. ఐదు తాలూకాల్లో వర్షాలు లేక పంటలు పండక పోవ డంతో పశువులకు పశుగ్రాసం కూడా లభించని దుస్థితి నెలకొంది. చెరువులు, కుంటలు, బావులు, వాగుల్లో నీరు లేకపోవడంతో పశువులను మేపడానికి పశుగ్రాసం లభించక రైతులు వాటిని కబేళాలకు విక్రయిస్తున్నారు. వాటిని జాతర సంతలో తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే సుమారు 1,60 లక్షలకు పైగా పశువులను విక్రయించినట్లు సమాచారం. తుంగభద్ర ఎడమ కాలువ కింద ఈసారి వరి పంటను తక్కువగా పండించడంతో పశు గ్రాసం కొరత ఏర్పడిందని రైతులు పేర్కొంటున్నారు. ఈసంవత్సరం వర్షాలు సరిగా కురువక పశుగ్రాసం లేక తల్లడిల్లిపోతున్నా పంట నష్టపరిహారం అంది చకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మౌనం వహిస్తున్నాయి. పరిహారం వస్తుం దన్న ఆశతో అధికారుల కార్యాలయాల చుట్టూ తిరిగినా తమకేమి పట్టనట్టు ఉండటంపై రైతులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు.



సంతలో సాగుతున్న పశువుల అమ్మకాలు

మద్యానికి ఆశపడి ఓటు వేయకండి



ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

కంప్లి, మార్చి 29: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మద్యపానం, డబ్బులకు లోబడి రాజ్యాంగం ఇచ్చిన ఓటుహక్కును దుర్వినియోగం చేసుకోరాదని హరప్పనహళ్లి తాలుకా అసిస్టెంట్ డైరెక్టర్ సోమశేఖర తెలిపారు. శుక్రవారం కునుబగట్టి గ్రామ పంచాయతీ పరిధిలోని నందికంబ గ్రామంలోని చెరువులో ఉపాధి కూలీలకు స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధి కూలీలు మే నెల 7వ తేదీన జరిగే ఎన్నికల్లో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం పనులకు వెళ్లి పనుల్లో నిమగ్నమై మధ్యాహ్నం ఇళ్లకు చేరుకుని వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. డబ్బులకు గానీ, మద్యంకు గానీ లోబడి ఓటు హక్కును అమ్ముకోరాదన్నారు.

హోసూరు జోన్

బన్నేరుఘట్ట జూకు సింగపూర్ కోతులు



వ్యాన్‌లో కోతులను తెస్తున్న అధికారులు



సింగపూర్ నుంచి వచ్చిన కోతులు

హోసూరు, మార్చి 29: బెంగళూరు శివారులోని బన్నేరుఘట్ట జూకు సింగపూర్ నుంచి హమాద్రియాస్ బబూన్ జాతికి చెందిన ఆరు కోతులు వచ్చాయి. ఇందులో రెండు మగ, నాలుగు ఆడ కోతులు వచ్చాయని అధికారులు తెలిపారు. ఒక నెలపాటు వాటిని సంరక్షించి ఇక్కడి వాతావరణానికి అలవాటు పడ్డాక అనంతరం పర్యాటకుల సందర్శనకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రాణుల వినిమయంలో భాగంగా కోతులు వచ్చాయన్నారు.

జింకలను వేటాడిన నిందితుల అరెస్టు

హోసూరు, మార్చి 29: సరిహద్దులోని ఆనేకల్‌లో జింకలను వేటాడినందుకు ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి దర్యాప్తు చేపట్టారు. ఆనేకల్ తాలూకా తమ్మనాయకనహళ్లి ప్రాంతంలోని బన్నేరు ఘట్ట నేషనల్ పార్క్ సమీపంలో జింక లను మాంసం కోసం వేటాడినట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. నిందితుల్లో ఒకడైన దేవరాజ్ రామనగర జిల్లా ఇండ్ల వాడి గ్రామానికి చెందిన వాడు. మరో ఇద్దరు నిందితులను కిషోర్, రామకృష్ణన్ గా గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



పోలీసుల అదుపులో నిందితులు

తనిఖీల్లో రూ.10లక్షల నగదు స్వాధీనం

హోసూరు, మార్చి 29: హోసూరు జుజువాడి చెక్‌పోస్టు వద్ద స్క్వాడ్ అధికారి విశ్వనాథ్ నేతృత్వంలో వాహనాల తనిఖీల సందర్భంగా రికార్డులు లేని రూ.10లక్షల నగదును గుర్తించారు. బ్లూమెటల్స్ కోసం పేరండపల్లికి చెందిన వ్యాపారి లోకేశ్(35) వద్ద ఈ నగదును గుర్తించారు. సరైన రికార్డులు లేని కారణంగా స్క్వాడ్ అధికారులు డబ్బును స్వాధీనం చేసుకుని సబ్ కలెక్టర్ ప్రియాంకకు అప్పగించారు.



నగదు సబ్ కలెక్టర్‌కు అప్పగిస్తున్న దృశ్యం

ప్రతికార్యకర్త నిబద్ధతతో పనిచేయాలి: బీజేపీ

రాయచూరు, మార్చి 29 : అభ్యర్థి ఎవరైనా పార్టీ గెల వాలన్నదే లక్ష్యంగా ప్రతి కార్యకర్త నిబద్ధతతో పని చేయా లని మాజీ ఎమ్మెల్యే తిప్పరాజ్ హవాల్దార్ కోరారు. బీజేపీ గెలవాలని, తిరిగి నరేంద్ర మోదీ ప్రధాని కావాలన్నదే లక్ష్యంగా ప్రతి కార్యకర్త రెట్టించిన ఉత్సాహంతో పార్టీ గెలుపు కోసం, అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. రాయచూరు లోకసభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు తాను ఆసక్తి చూపినా పార్టీ నాయకత్వం సిట్టింగ్ ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్‌ను తిరిగి అభ్య ర్థిగా ప్రకటించిందని ఈ క్రమంలో అభ్యర్థి గెలుపు కోసం ప్రతి కార్యకర్త పూర్తి కృషి చేయాలన్నారు. తనకు టికెట్ రాలేదన్న అసంతృప్తి వద్దని కార్యకర్తలకు హితవుపలి కారు. శుక్రవారం నగరంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో పార్టీ కార్యకర్తలు, అభిమానుల సమావేశంలో పాల్గొన్న తిప్పరాజ్ హవాల్దార్ తాను గత శాసనసభ ఎన్నికల్లో ఓటమి చెందినా ఇప్పటికి పార్టీ కార్యకర్తలు తన వెంటే ఉన్నారని వారి రుణం తీర్చుకునే దిశగా తన రాజకీయం ఉంటుందన్నారు. రాజకీయాల్లో ధనం, పదవి ఆశతో రాలే దని కేవలం సేవాభావంతోనే తాను రాజకీయాల్లోకి వచ్చా నని తిప్పరాజ్ హవాల్దార్ స్పష్టం చేశారు. ఈ క్రమంలో పార్టీని తిరిగి అధికారంలోకి తేవడమే లక్ష్యంగా నాయ కులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని కోరారు.



సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తిప్పరాజ్ హవాల్దార్

గుణాత్మక విద్యకు ప్రతీక నవోదయ : డాక్టర్ కేఎస్ రవీంద్రనాథ్

రాయచూరు, మార్చి 29 : నగరంలో వెలసిన నవో దయ విద్యసంస్థ గుణాత్మక విద్యనందించేందుకు ప్రతీ కగా నిలిచిందని బెంగళూరుకు చెందిన జయదేవ్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ కేఎస్ రవీంద్రనాథ్ అన్నారు. విద్యను వ్యాపారదృక్పథంతో కాకుండా సేవాభావంతో అందించడం అభినందనీయమన్నారు. నగరంలోని నవోదయ విద్యసం స్థలో నర్సింగ్, ఫార్మసీ, పారామెడికల్, ఫిజియోథెరపి విభా గంలో డిగ్రీలు పూర్తి చేసిన వారికి శుక్రవారం పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కేఎస్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ, వైద్యవిద్య కేవలం అభ్యసించడం మాత్రమే సరికాదన్నారు. ఒక్క వైద్య విద్య వల్లే పూర్తి మెరుగైన చికిత్సనందించడం సాధ్యం కాదని అదే సమయంలో ఆస్పత్రి నిర్వహణలో ఫార్మసీ, ఫిజియోతెరపి వంటి వాటిని భాగస్వాములు చేయడం ద్వారా మెరుగైన చికిత్సనందించేందుకు నవోదయ ఆస్పత్రి చేస్తున్న ప్రయత్నం ఇతర విద్యసంస్థలకు మార్గదర్శకం కావాలన్నారు. ఈ సందర్భంగా డిగ్రీలు పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

దేవికారాణి (జయంతి)



దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు తొలి గ్రహీత దేవికారాణి 1908 మార్చి 30న విశాఖపట్నం సమీపాన వాల్తేరులో జన్మించారు. పూర్తి పేరు దేవికా రాణి చౌదరి. ఈమె తండ్రి భారత దేశపు తొలి సర్జన్ జనరల్ కల్నల్ ఎంఎన్ చౌదరి. ఆమె జర్మనీకి చెందిన సినీ నిర్మాత హిమాంశు రాయ్‌ను పెళ్లి చేసుకున్నారు. సొంతంగా 'కర్మ' అనే చిత్రాన్ని నిర్మించి హీరో, హీరోయిన్‌లుగా హిందీలోకి అనువదించి విడుదల చేయగా ఘన విజయం సాధించింది. బాంబే టాకీస్ ద్వారా వర్ధమాన కళాకారులను ప్రోత్సహించారు. దేవికారాణి, అశోక్ కుమార్‌ల జంట హిట్‌పెయిర్‌గా నిలిచింది. టెక్స్‌టైల్ డిజైనర్‌గా, గాయనిగాను ప్రతిభ చాటుకున్నారు. 1940లో హిమాంశు మరణానంతరం రష్యన్ చిత్రకారుడు రోరిచ్‌ను వివాహం చేసుకున్నారు. సినీ రంగంలో సేవలకు 1958లో పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. 1994 మార్చి 9న కన్నుమూశారు.

ఇంగ్వర్ కాంప్రాడ్ (జయంతి)



అంతర్జాతీయంగా పేరొందిన (ఐకెఇఎ) 'ఐకియా' సంస్థ సంస్థాపకుడు ఫియోడర్ ఇంగ్వర్ కాంప్రాడ్ 1926 మార్చి 30న జన్మించారు. స్వీడిష్ దేశానికి చెందిన వ్యాపారదిగ్గజం. ఫర్నీచర్ రంగంలో విప్లవాత్మక మార్పులు సాధించారు. తన జీవితంలోని ఒడిదుడుకులు, విజయాలతో కూడిన 'ఏ టెస్టమెంట్ ఆఫ్ ఏ ఫర్నీచర్ డీలర్' పుస్తకాన్ని రచించారు. అదే విధంగా 'లీడింగ్ బై డిజైన్ : ది ఐకియా స్టోరీ' ఆటో బయోగ్రఫీని రాశారు. 2018 జనవరి 27న కన్నుమూశారు.

ఏకేసీ నటరాజన్ (పుట్టినరోజు)



కర్ణాటక సంగీత క్లారినెట్ విద్వాంసుడు అంజల కుప్పుస్వామి చిన్నికృష్ణ (ఏకేసీ) నటరాజన్ 1931 మార్చి 30న తమిళనాడు రాష్ట్రం తిరుచిరా పల్లి (తిరుచ్చి)లో జన్మించారు. గాత్ర సంగీతాన్ని అలత్తూరు వెంకటేశ అయ్యర్ వద్ద, నాదస్వరాన్ని ఇలుప్పుర్ నటేశపిళ్లై వద్ద నేర్చుకున్నారు. నాదస్వర పండితుడు టీఎన్ రాజరత్నం పిళ్లై ఇతడిని 'క్లారినెట్ ఎవరెస్ట్'గా అభివర్ణించారు. పద్మశ్రీ పురస్కారం, సంగీత కళానిధి, సంగీత నాటక అకాడమీ అవార్డు, నాదద్వీప కళానిధి తదితర పురస్కారాలు పొందారు. ఆకాశవాణి నిలయ విద్వాంసుడిగా పలు సంగీత కార్యక్రమాలు నిర్వహించారు.

నోరా జోన్స్ (పుట్టినరోజు)



నోరా జోన్స్‌గా చిరపరిచితురాలైన గీతాలి నోరా జోన్స్ శంకర్ 1979 మార్చి 30న న్యూయార్క్‌లో జన్మించారు. సితార్ మేస్ట్రో పండిట్ రవి శంకర్ కుమార్తె. ప్రపంచ వ్యాప్తంగా ఇంతవరకు 50 మిలి యన్ రికార్డ్స్ అమ్ముడయ్యాయి. అమెరికాలో గాయ నిగా, గీత రచయితగా, నటిగా, పియానో కళాకారిణిగా పేరొందారు. 'కమ్ అవే విత్ మి' ఆల్బమ్ ప్రపంచ వ్యాప్తంగా 27మిలియన్ కాపీలు అమ్ముడైంది. 9 గ్రామీ అవార్డులు అందుకున్నారు. బిల్‌బోర్డ్ పత్రిక 2000లో ఆమెను టాప్ జాజ్ ఆర్టిస్ట్‌గా అభివర్ణించింది.

చౌడేశ్వరీదేవికి పూజలు



చౌడేశ్వరిదేవికి ప్రత్యేక అలంకరణ

లేపాక్షి, మార్చి 29: అతి పురాతన చౌడేశ్వరి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లేపాక్షి దుర్గా, వీరభద్రస్వామి ఆలయ కమిటీ చైర్మన్ రమానంద ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, ప్రాణప్రతిష్ఠ చేపట్టారు. కార్యక్రమానికి భక్తులు చుట్టుపక్కల ప్రాంతాల నుంచేకాక కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో విచ్చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎంపీ అభ్యర్థి చంద్రప్పకు యాదవానందస్వామి ఆశీస్సులు



చంద్రప్పను ఆశీర్వదిస్తున్న స్వామీజీ

పావగడ, మార్చి 29: కాంగ్రెస్ చిత్రదుర్గం పార్లమెంటు అభ్యర్థి చంద్రప్పకు యాదవ మఠాధీశ్వరుడు యాదవానందస్వామి తన ఆశ్రమంలో ఆశీర్వదించి అభినందించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా అధిష్టానం ప్రకటించడంతోపాటు బిఫాం కూడా అందజేయడంతో యాదవమఠానికి తరలివెళ్లి స్వామీజీ ఆశీర్వాదం పొందారు.

కోడ్ అమలులో అధికారుల పక్షపాతం

▸▸ బీబీఎంపీ అధికారుల తీరుపై ఎన్నికల కమిషన్‌కు బీజేపీ ఫిర్యాదు

బెంగళూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకు నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అధికారులు బాధ్యత మరచి వ్యవహరిస్తున్నారని బీజేపీ నాయకులు మండిపడ్డారు. విగ్రహాలను మూసివేసే విషయమై ఏకపక్షంగా వ్యవహరించిన బీబీఎంపీ అధికారుల తీరుపై ఎన్నికల కమీషన్‌కు బీజేపీ నాయకులు బృందం ఫిర్యాదు చేసింది. రాజాజీనగర్‌లోని ఇండోర్‌స్టేడియం ప్రాంగణంలో ఉండే మాజీ ప్రధాని వాజ్‌పేయి విగ్రహాన్ని మూసివేసిన అధికారులు రాజాజీనగర్ ప్రవేశ సర్కిల్‌లో భారీగా ఉండే మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని వదిలేశారంటూ మండిపడ్డారు. రెండు విగ్రహాల ఫోటోలను వారు ఎన్నికల కమీషన్‌కు ఇచ్చినట్లు తెలిపారు. కమీషన్ కార్యా లయం వద్ద ఎమ్మెల్సీలు రవికుమార్, చలవాది నారాయణస్వామి సహా పలువురు మాట్లాడుతూ చిక్కోడి నియోజకవర్గ పరిధిలో బీజేపీ ప్రచార వాహనాన్ని అడ్డుకున్న విషయాన్ని కమీషన్ దృష్టికి తీసుకువచ్చామన్నారు. సీఎం సిద్దరామయ్య కుమారుడు యతీంద్ర కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పట్ల అనుచితంగా మాట్లాడటంపైనా ఫిర్యాదు చేశామన్నారు. ఒకప్పుడు నేరప్రవృత్తి కలిగిన అమిత్‌షా నేడు కేంద్రహోం మంత్రి అంటూ వ్యాఖ్యానించడంపైనా ఫిర్యాదు చేశామన్నారు. యతీంద్ర బాధ్యత లేకుండా మాట్లాడారన్నారు.

1న జేడీఎస్-బీజేపీ మైత్రి సభ



మీడియాతో జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు మునేగౌడ తదితరులు

దొడ్డబళ్లాపుర, మార్చి 29: లోక్‌సభ ఎన్నికల్లో మైత్రి అభ్యర్థి విజయం కోసం బీజేపీ-జేడీఎస్‌ల మధ్య ఏప్రిల్ 1న ప్రత్యేక సమావేశం జరగనుందని జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు బీ మునేగౌడ తెలిపారు. పట్టణంలోని జేడీఎస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 1వ తేదీ సభలకు నిఖిల్ కుమారస్వామి, బీజేపీ అభ్యర్థి డాక్టర్ కే సుధాకర్ పాల్గొంటారని తెలిపారు. నరేంద్ర మోదీని మళ్లీ ప్రధాని చేయడం, రాష్ట్రంలో దుష్ట కాంగ్రెస్ పాలన తొలగించడమే లక్ష్యంగా జేడీఎస్, బీజేపీలు ఒక్కటయ్యాయన్నారు. చిక్కబళ్లాపుర బరిలో ప్రస్తుతం మాజీ మంత్రి డాక్టర్ కే సుధాకర్ బరిలో ఉన్నారని, ఆయన విజయం కోసం ఒక్కలిగ భవనంలో ఏప్రిల్ 1న సమావేశం జరగనుందన్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు దేవనహళ్లిలోనూ, మధ్యాహ్నం 2 గంటలకు దొడ్డబళ్లాపురలోనూ, సాయంత్రం 4 గంటలకు నెలమంగలలోనూ సమావేశాలు జరుగుతాయన్నారు. మీడియా సమావేశంలో జేడీఎస్ ప్రముఖురాలు లక్ష్మీపతయ్య, స్థాయి సమితి అధ్యక్షుడు వడ్డరహళ్లి రవి, కాంతమ్మ, దేవరాజమ్మ, మంజునాథ్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

వేసవి యోగా శిబిరం ప్రారంభం



శిబిరం ప్రారంభంలో చిన్నారులు తదితరులు

చింతామణి, మార్చి 29: పిల్లలకు సంస్కారం, యోగా గురించి తెలిపే వేసవి శిబిరాన్ని పతంజలి యోగా శిక్షణ సమితి చింతామణిశాఖ నిర్వహించడం సంతోషంగా ఉందని సమితి సంచాలకులు నారాయణప్ప తెలిపారు. పట్టణంలోని కేఆర్ లే అవుట్ ట్యాంక్‌బండ్ రోడ్డులోని పతంజలి యోగ శిక్షణ మందిరంలో 10-18ఏళ్లలోపు వారికి వేసవి వసంత శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. యోగాతో మనదేశం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. మన పూర్వీకులు, ప్రధానమంత్రి, మాజీ ప్రధానులు సైతం యోగాతో ఆరోగ్యాన్ని పెంపొందించుకున్నారని, ఇదే రీతిన దేశంలో ఎంతోమంది యోగాతో ఆరోగ్యంగా ఉన్నారని వివరించారు. పిల్లలకు విద్య, క్రీడలతోపాటు మంచి సంస్కారం నేర్పాల్సిన బాధ్యత మనపై ఉందని ఇందుకు పతంజలి యోగ శిక్షణ సమితి శిబిరాల ఏర్పాటుకు చొరవ చూపడం అభినందనీయమన్నారు. సమితి మహిళా సంచాలకులు గీతక్క మాట్లాడుతూ సమితి గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదని, యోగాతో ఆధ్యాత్మిక జ్ఞానాన్ని కూడా పెంపొందించు కోవచ్చునన్నారు. కార్యక్రమానికి యోగమందిర విశ్వస్థమండలి సభ్యుడు శ్రీనివాస శెట్టి అధ్యక్షత వహించారు. తొలిరోజు శిబిరంలో 70మంది పిల్లలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ యోగా ట్రైనర్ అశ్వథణ్ణ, రాజశేఖర్, యాగంటి, రామచంద్ర సుశీలా, రమేశ్‌గౌడ, శివకుమార్, కార్తీక్, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో విజయం సాధించండి

▸▸ అభ్యర్థులకు డీకే శివకుమార్ సూచన.. బి-ఫారాల పంపిణీ

బెంగళూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో సమన్వయంతో వ్యవహరించి గెలుపు సాధించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు, డీసీఎం డీకే శివకుమార్ సూచించారు. శుక్రవారం పలువురు అభ్యర్థులకు బి-ఫారాలను అందజేశారు. తుమకూరు - ముద్ద హనుమేగౌడ, చిత్రదుర్గ అభ్యర్థి చంద్రప్ప, బెంగళూరు దక్షిణ సౌమ్యరెడ్డి, మండ్య - వెంకటరమణేగౌడ అలియాస్ స్టార్ చంద్రు, బెంగళూరు ఉత్తర - రాజీవ్‌గౌడ, బెంగళూరు సెంట్రల్ అభ్యర్థి మన్సూర్ అలి ఖాన్‌కు బి-ఫారాలను అందజేశారు. పలువురు ఆయన ఆశీస్సులు పొందారు.





ముద్ద హనుమేగౌడ, వెంకటరమణేగౌడలకు బి-ఫారం అందజేత



ప్రొఫెసర్ రాజీవ్‌గౌడకు...



సౌమ్యరెడ్డికి బి-ఫారం అందజేత



మన్సూర్ అలిఖాన్‌కు...

చిన్నచూపు చూస్తే సహించేది లేదు



మీడియాతో సూలికుంటె ఆనంద్

బంగారపేట, మార్చి 29: లోక్‌సభ ఎన్నికల వేళ కొంతమంది రాజకీయ నాయకులు తమ ప్రయోజనాలకోసం నిమ్నవర్గాలవారిని కుడిభుజంగాను, ఎడమభుజంగాను అభివర్ణించుకుంటున్నారని ఇలా చిన్నచూపు చూస్తే సహించేది లేదని కర్ణాటక దళిత సమాజసేన సంస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సూలికుంటె ఆనంద్ పేర్కొన్నారు. పట్టణంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎస్సీ వర్గాలలో చీలికలు తెచ్చేలా కొంతమంది వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వంటి మహానాయకులు ఎన్నో కష్టనష్టాలకోర్చి మనకు అమృతంలాంటి రాజ్యాంగాన్ని అందించారని, వీటి ప్రయోజనాలను అందరూ పొందుతున్నారన్నారు. ఎస్సీ వర్గాల ప్రజలను కేవలం ఓటుబ్యాంకుగానే పరిగణిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు తమ అనుచరులకు టికెట్‌లు ఇప్పించుకుంటే తమకేమీ అభ్యంతరం లేదని, ఈ నెపంతో ఎస్సీలను తారతమ్యంగా చూడడం సరి కాదన్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు గౌతమ్, తాలూకా కార్యాధ్యక్షుడు ఎస్‌వీ మంజు, ప్రముఖులు భాగ్యరాజ్, ప్రవీణ్ చక్రవర్తి, సిజామిల్ బాషా, ఐయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

నాటకరంగంతోనే సమాజంలో మార్పు

బెంగళూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రాచీనం నుంచి ఆధునికంవైపు మారిన సమాజానికి అనుగుణంగా నాటకాలు దోహదపడ్డాయని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసనాయక అభిప్రాయపడ్డారు. కళాశాలలో ప్రపంచరంగస్థల దినోత్సవాన్ని జరిపారు. కన్నడ సంఘం సంచాలకులు, అధ్యాపకులు డాక్టర్ రుద్రేశ్ అదరంగి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ శ్రీనివాసనాయక మాట్లాడుతూ రంగస్థలం నుంచి ఎంతోమంది కళాకారులు ఉన్నత శిఖరాలకు ఎదిగారన్నారు. సినిమా నటులలో ఎక్కువమంది నాటకాలతోనే పేరొందారన్నారు.



రంగస్థల దినోత్సవంలో అధ్యాపకులు, విద్యార్థుల బృందం

ఫుట్‌పాత్ దుకాణాల పరిశీలన



దుకాణాలను పరిశీలిస్తున్న పురసభ ముఖ్య అధికారి సంతోష్‌కుమార్

విజయపుర, మార్చి 29: దేవనహళ్లి తాలూకా విజయపుర పట్టణంలోని ఫుట్‌పాత్ హోటల్స్‌ను పురసభ ముఖ్య అధికారి సంతోష్‌కుమార్ ఆకస్మిక తనిఖీలు చేశారు. హోటళ్లలో నాణ్యతలేని కవర్ల వాడకాన్ని గుర్తించి హెచ్చరించి స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే పురసభ తరపున నిత్యావసర దుకాణాలు, కూరగాయల దుకాణదారులకు పలు సూచనలు చేశామని, ప్లాస్టిక్ కవర్లు వాడరాదని హెచ్చరించామన్నారు. ప్రస్తుతం ఫుట్‌పాత్ హోటళ్లు, దుకాణాలను తనిఖీ చేస్తున్నామని, అదే రీతిన కల్యాణమండపాలపై కూడా దాడులు నిర్వహించి ప్లాస్టిక్ వాడితే జరిమానా తప్పదని హెచ్చరించామన్నారు. అదేరీతిన వారపుసంతలోనూ దుకాణదారులకు వార్నింగ్ ఇచ్చి జరిమానా విధించామన్నారు. పర్యావరణ వాతావరణానికి ప్రజలంతా సహకరించాలని, ప్లాస్టిక్ రహితయే లక్ష్యమన్నారు.

ఓటరు సభ్యత్వ నమోదుపై సమావేశం

బొమ్మనహళ్లి, మార్చి 29: ఓటరు నమోదుకు సంబంధించి బెంగళూరు గ్రామీణ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి స్వతంత్రంగా పోటీ చేస్తున్న ఉదయ్‌సింగ్ జేపీనగర్‌లో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఎంతోమంది డిగ్రీ చదివినవారు ఉన్నా సభ్యత్వ నమోదు చేసుకోవాల్సిన వారు పెద్దసంఖ్యలో ఉన్నారన్నారు. ఈ అంశంపై డిగ్రీ, పీజీ చేసినవారు మరింత శ్రద్ధ చూపాలని అభిప్రాయపడ్డారు. కాగా తనను గెలిపిస్తే నిరుద్యోగ సమస్య నివారణకు తగిన చొరవ చూపుతామన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపడతానన్నారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల నిర్వాహకులు, తదితరులు ఆయనకు మద్దతు ఇచ్చారు.



సమావేశంలో ఉదయ్‌సింగ్ తదితరులు

నేడు అవంతిపటేల్ సంగీత కచేరి

బెంగళూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గజల్, దాద్రా, హిందూస్థానీ, సెమి క్లాజికల్ విభాగంలో అవంతిపాటిల్ ఆధ్వర్యంలో సంగీత కచేరీ జరగనుంది. శనివారం జేపీనగర్‌లోని ఇండియన్ మ్యూజిక్ ఎక్స్‌పీరియెన్స్ వేదికపై సాయంత్రం 6.30 గంటలకు సంగీత కచేరీ జరగనుంది. యువ శాస్త్రీయ సంగీత కళాకారులు నిర్వహిస్తున్న కార్యక్రమం మరో కొత్త అధ్యయనం కానుందని నిర్వాహకులు తెలిపారు.

ఫలించని సీఎం, డీసీఎం చర్చలు - వీణా కాశప్ప రాజీనామా



వీణా కాశప్పనవర్

బెంగళూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): బాగల్కోటె టికెట్ ఆశించి భంగపడిన జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ వీణా కాశప్పనవర్ అన్ని పదవులకు రాజీనామా చేస్తానని ప్రకటించారు. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివ కుమార్‌లు జరిపిన చర్చలు ఫలించలేదు. గురువారం రాత్రి పొద్దుపోయేదాకా వీణా వర్గీయులతో సీఎం మం తనాలు జరిపారు. బెంగళూరులో శుక్రవారం ఆమె మీడి యాతో మాట్లాడుతూ స్క్రీనింగ్ కమిటీ దాకా నా పేరు సిఫారసు అయినట్టు ఎమ్మెల్యేలు తెలిపారన్నారు. నాకు టికెట్ దక్కకపోవడం వెనుక కుట్ర ఉందన్నారు. పంచమశాలి వర్గీయుల్లో మహిళలు ఎదగడాన్ని కొందరు సహించ లేదన్నారు. బాగల్కోటె అభ్యర్థిగా సంయుక్త పాటిల్‌కు అవకాశం ఇచ్చారన్నారు. ఆమె భర్త బీదర్‌కు చెందినవారని, అక్కడ టికెట్ అయితే అభ్యంతరం లేదన్నారు. సంయుక్తపాటిల్ గత ఎన్నికల్లో ఎక్కడ పనిచేశారని ప్రశ్నించారు. ఐదుమంది ఎమ్మెల్యేలు ఉన్నారనే కారణంతోనే లోక్‌సభ టికెట్ సాధించారన్నారు. కాగా కేపీసీసీ ప్రధాన కార్యదర్శిగాను, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా కొనసాగుతున్నా అన్నా రు. జిల్లాలో తీవ్ర వ్యతిరేకత ఉన్న కాలంలోనూ పార్టీ విజయానికి పని చేశామ న్నారు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని, టికెట్ వచ్చేసరికి విస్మరిస్తే ఎలా కొన సాగాలన్నారు. కాంగ్రెస్ పార్టీ పదవులకు రాజీనామా చేస్తానని, ప్రచారానికి వెళ్లేది లేదన్నారు. రెండు రోజుల తర్వాత తన నిర్ణయాన్ని ప్రకటిస్తానన్నారు.

కాశీ విశ్వనాథేశ్వర ఆలయానికి రూ.1.50 లక్షల విరాళం



ఆలయ కమిటీ ట్రస్టు పదాధికారులకు డీడీ అందజేత

చింతామణి రూరల్, మార్చి 29: తాలూకాలోని చిలకలనేర్పు హోబళి కొర్లపర్తి గ్రామస్థులు చేపట్టిన కాశీ విశ్వనాథేశ్వర దేవస్థాన నిర్మాణానికి చింతామణి ధర్మస్థళ సంస్థ ఆధ్వర్యంలో రూ.1.50 లక్షలు విరాళం అందచేశారు. ఈమేరకు డీడీ మొత్తాన్ని సంస్థ యోజనాధికారి వినోద్ ఆలయ కమిటీ పదాధికారులకు శుక్రవారం అంద చేశారు. యోజనాధికారి వినోద్ మాట్లాడుతూ ధర్మస్థళ సంస్థ ఆధ్వర్యంలో పురాతన ఆలయాల జీర్ణోద్ధరణ, నూతన ఆలయాల నిర్మాణానికి చేయూత ఇస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఆలయ నిర్మాణాన్ని పరిశీలించి సదరు మొత్తాన్ని అంద చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ట్రస్టీ అధ్యక్షుడు రాజేశ్, ఉపాధ్యక్షుడు కేసీ మంజునాథ్, కార్యదర్శి రమేశ్‌బాబు, గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై జాగృతికి ఒప్పందం



రోటరీ క్లబ్ విభాగాల ప్రముఖులు తదితరులు

బొమ్మనహళ్లి, మార్చి 29: కేన్సర్‌పై జాగృతి కల్పించేందుకు రోటరీ క్లబ్ విభాగాలు ప్రత్యేకంగా పని చేయనున్నాయి. ఈ మేరకు రోటరీక్లబ్ కోరమంగల, మిడ్‌టౌన్, సౌత్ పరేడ్, పామ్‌విల్లె, జేపీనగర్ విభాగాలు శంకర్ ఆసుపత్రితో ఒప్పందం కుదు ర్చుకున్నారు. సమాజసేవలో భాగంగా ప్రజలను ప్రత్యేకించి బ్రెస్ట్ కేన్సర్ గురించి గౌరిబిదనూరు, చిక్కబళ్లాపుర చింతామణి, బాగేపల్లి తదితర ప్రాంతాల్లో అవ గాహన కల్పిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కేన్సర్‌కు సంబంధించి డాక్టర్ శ్రీనాథ్ పలు అంశాలను సమగ్రంగా వివరించారు. కాగా బొమ్మనహళ్లి, హెచ్‌ఎస్ ఆర్ లే అవుట్ తదితర ప్రాంతాల్లో పాఠశాలలను మాడల్ స్కూల్స్‌గా అభివృద్ధి చేశామన్నారు. సమావేశంలో రోటరీక్లబ్ పలువిభాగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

ఘనంగా సంకష్టహర చతుర్థి పూజలు



వీరాపుర గణపతి ఆలయంలో స్వామివారికి విశేష అలంకరణ

శిడ్లఘట్ట, మార్చి 29: సంకష్టచతుర్థిని పురస్కరించుకుని తాలూకాలోని వీరాపుర గ్రామంలో కొలువైన వీరాపుర గణపతి దేవాలయంలో గురువారం సాయంత్రం విశేషపూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ శుద్ధి అనంతరం స్వామివారికి అభిషేకం, మహామంగళారతి, భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం స్వామి వారికి పుష్పాలంకరణ, గరికతో పూజలు చేశారు. పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు కీర్తనలు ఆలపించారు. అన్నసంతర్పణ నిర్వహించారు. కాగా పట్టణంలో అశోకరోడ్డులో కొలువైన ద్విముఖ గణపతి ఆలయంలోనూ సంకష్టహర చతుర్థి పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి.

గోడంబి తోటకు నిప్పు - భారీ నష్టం



కాలిపోతున్న తోట

శిడ్లఘట్ట, మార్చి 29: తాలూకాలోని ఇద్లూడు గ్రామం వేణుకు చెందిన గోడంబి తోటకు నిప్పు అంటుకోవడంతో లక్షలాది రూపాయల నష్టం వాటిల్లింది. వేసవి ఎండలు మండుతున్న వేళ ఎండిన ఆకులు, ఎండుపొదలకు నిప్పు అంటుకోవడం సామాన్యంగా మారింది. ఇది అకస్మికంగా చోటు చేసుకుందా లేదా గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారా అనేది తెలియరావడం లేదు. గురువారం సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్‌లతో చేరి మంటలు ఆర్పివేశారు. తాలూకా వ్యాప్తంగా తరచూ అగ్ని ప్రమాదాలు చోటు చేసు కోవడంపై రైతులలో ఆందోళన నెలకొంది.

ఆర్థిక సంస్కరణల దిశగా లాన్సెక్స్

బెంగళూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంవత్సరంలో ఆదాయాన్ని సంస్కరించే దిశగా లాన్సెక్స్ కంపెనీ ప్రతినిధులు ప్రకటించారు. ఈమేరకు బెంగళూరులో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2023 ఆర్థిక సంవత్సరంలో గ్రూప్ సంస్థలు 6.714 బిలియన్‌లు యూరోలుగా ఉండేదని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 8.088 బిలియన్ యూరోలుగా ఉందన్నారు. మార్కెటింగ్‌లో డిమాండ్‌తోపాటు పలు ఒడిదుడుకులు ఎదుర్కొన్నట్టు ప్రకటించారు. జర్మన్ దేశ రసాయన కంపెనీ గతంలో ఎన్నడూ లేనంతగా ఇబ్బందులు పడిందన్నారు.

అదుపుతప్పి కొండను ఢీకొన్న కంటైనర్

పెనుకొండ రూరల్, మార్చి 29: పట్టణానికి సమీపంలోని పులేకమ్మ ఆల యం వద్ద 44వ జాతీయ రహదారిపై శుక్రవారం కంటైనర్ అదుపుతప్పి కొండను ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు బీహార్‌కు చెందిన అన్సార్‌సాదిక్ స్వాతి ట్రాన్స్‌పోర్ట్ కంటైనర్‌ను బెంగళూరు నుంచి హైదరాబాద్ మీదుగా బీహార్‌కు తరలిస్తున్నాడు. మార్గమధ్యంలో పులేకమ్మ గుడివద్దకు రాగానే వాహనం అదుపుతప్పి కొండను ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన డ్రైవర్‌ను కంటైనర్‌లోంచి బయటకు తీసి 108సాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని జాతీయ రహదారిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా కంటైనర్‌ను పక్కకు తొలగించారు.